మానవతా విలువలు :

# వ్యవస్థతో, కరువుతో పోరాడుతున్న ఆదిలాబాదు ఆదివాసులు

కె. బాలగోపాల్

ఇందిరమ్మ సోషలిజం ఎందాకొచ్చిందిరో
ఇంద్రవెల్లిలోన వందమందిని మింగిందిరో

ఇందిరమ్మ తండ్రి సోషలిజం తెలంగాణాలో కొన్నివేలమందిని మింగింది. ఇందిరమ్మ సోషలిజం ఇంద్రవెల్లిలోను గువాలోను ఇంకా మనకు పేర్లుగూడా వినబడని ఎన్నో మారుమూల గ్రామాలలో, గూడాలలో గిరిజనులను అసంఖ్యాకంగా మింగింది, మింగుతోంది. కాంగ్రెస్ సోషలిజపు ఆకలి గిరిజనులతో సంతృప్తి చెందేది కాదుగాని, ఎ. కె. రాయ్ అన్నట్టు అది గిరిజనులను మింగినంత సులువుగా ఇతరులను మింగలేదు. సాధారణ మధ్య తరగతి దృక్పథంలో గిరిజనులు తాగుబోతులు, 'డబ్బు విలువ' తెలీని వాళ్ళు. బర్రెలిస్తే అమ్ముకుంటారు. గొర్రెలిస్తే వండుకుతింటారు. ఏమంటే ఈటెలు, బరిసెలు తీసుక మీదబడతారు. గిరిజన స్త్రీలకు 'శీలం' ఉండదు. వాళ్ళ శరీరాలమీద పై కులాల మగవాళ్ళకు సహజ అధికారం వుంది. భోగ వస్తువులుగా వాడబడడం వాళ్ళకు బాధగాని, అవమానంగాని కలిగించదు. ఎందుకంటె వాళ్ళసలు మనలాంటి "సంస్కారవంతులు" కారు. ఒరిస్సాలోను, బీహార్‌లోను బస్తర్‌లోను ఫారెస్టు అధికార్లుకాంట్రాక్టర్లు తమఊళ్ళలో పతివ్రతలయిన పెళ్ళాలనుంచుకొని,వాళ్ళపాతివ్రత్యాన్ని కాపాడడానికికావలసిన సాంస్కృతికమయిన కట్టుబాట్లు చేసి, గిరిజన ప్రాంతాలలో తమ భౌతిక అవసరాలు తీర్చడంకోసం గిరిజన స్త్రీలను వంచించి 'పెళ్ళి' చేసుకుని, బదిలీ అయినప్పుడో వేరేచోట కాంట్రాక్టులు చిక్కినప్పుడో ఆ స్త్రీని, ఆమెకు పుట్టిన పిల్లలను,వాళ్ళ పాట్లకు వాళ్ళను వదిలి వెళ్ళిపోయిన కేసులు అసంఖ్యాకం. భౌతిక అవసరాలకే కాదు, ఆస్తికిగూడ గిరిజన స్త్రీలు పనికివచ్చారు. చాలా గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరులకు చట్టరీత్యా భూమి కొనుక్కునే హక్కు లేదు. అయితే చాలా గిరిజన తెగల్లో మాతృస్వామికపు అవశేషంగా స్త్రీలకు ఆస్తిహక్కు ఉండడం చేత, గిరిజన స్త్రీలను 'పెళ్ళి' చేసుకుని గిరిజనుల భూములను ఆక్రమించుకున్న కేసులూ ఉన్నాయి.

ఇదంతా కొత్తేం కాదు. అర్జునుడు, భీముడు మొదలయిన పురాణ హీరోలు 'నాగరాజ కుమార్తెల'ను, 'గంధర్వస్త్రీ'లను పెళ్ళి చేసుకుని నాలుగేళ్ళపాటు 'నాగలోకం'లోనో 'గంధర్వలోకం'లోనో నివసించి తిరిగి వచ్చారని చిన్నతనం నుండీ చదువుకున్నాం. ఆ 'గంధర్వులూ' 'నాగజాతులూ' గిరిజనులు. నాగరిక వర్గ సమాజానికి చెందిన ఆర్యులు ఆర్యేతరులను బలవంతంగా నాగరీకరించిన క్రమంలో ఇదొక భాగం. ఆ బలవంతపు నాగరీకరణ ఈనాడూ సాగుతోంది. ఆనాటి పురాణ హీరోల వారసత్వం ఈనాటి ఠాకూర్ భూమిహార్ బ్రాహ్మణ హీరోలకు సంక్రమించింది. తేడాఅల్లా, ఈనాటి గిరిజనులు రెండువందల సంవత్సరాల సామ్రాజ్యవాద దోపిడీవల్ల ఆనాటికంటె నికృష్టమయిన జీవితం గడుపుతున్నారు; అంతేకాకుండ ఈనాటి నాగరీకరణ ఫ్యూడల్‌రూపంలో కాక పెట్టుబడిదారీ రూపంలో రావడంవల్ల మరింత దౌర్జన్యంగాను హింసాత్మకంగాను సాగుతోంది.

ఈ వాతావరణంలో గిరిజనేతర ప్రపంచం, గిరిజనులపై జరిగే దౌర్జన్యాలను, కసాయివాడి చేతిలో పశువులపై జరిగే హింసను చూసినంత నిర్లక్ష్యంగా చూడగలుగుతుంది; అందుకే ఈ వాతావరణంలో గిరిజనులపై దౌర్జన్యాలు చాలా సులువుగా సాగించగలరు—సాగించేవారు కాంట్రాక్టరుగాని, వడ్డీవ్యాపారస్తులుగాని, ఫారెస్టు అధికారులుకానీ, భూస్వాములు గాని, వీళ్ళందరి సాయుధ సేవకులయిన పోలీసులు గానీ.

మార్కెట్ల విస్తరణకోసం, ముడిసరుకుల కోసం, జరిగే బలవంతపు నాగరీకరణను సాధించడానికేగాదు, ఆ బలాత్కారానికి వ్యతిరేకంగా గిరిజనులుచేసే తిరుగుబాటును అణచడానికి గూడ పాలకవర్గాలకు ఈ దౌర్జన్యాలు అవసరం. అడవులను కాంట్రాక్టర్లకోసం, వాళ్ళనుండి వెదురుబొంగు కొనుక్కునే బిర్లాల పేపరుమిల్లుకోసం, సురక్షితం చేసినప్పుడు, ఆ అడవుల రక్షణార్థం 15000 మంది గోండ్లను తమ భూములనుండి తరిమేసినప్పుడు, వాళ్ళకు విపరీతపు వడ్డీకి అప్పులిచ్చి ఆ అప్పులు వాళ్ళు తీర్చలేకపోగా వాళ్ళ భూమిని గిరిజనేతరులు కాజేసినా Tribal Land Alienation Act లు కళ్ళు మూసుకున్నప్పుడు, ఆదిలాబాద్ గిరిజనులు తిరగబడ్డారు. వాళ్ళు తిరగబడ్డప్పుడు పోలీసులు వచ్చారు. చెట్లమీద కూర్చుని కాల్పులు జరిపి, వందమందినో ఎందరినో (దేవుడుంటే దేవుడెరుగుగాని, వాడు లేడు కాబట్టి గోండ్లయినా ఎరుగుదురో లేదో) చంపారు.

అది గత ఏప్రిల్ 20 న. అటు తరువాత, వ్యవస్థ దౌర్జన్యానికి ప్రకృతి దౌర్జన్యం గూడ తోడయింది. గత కొద్ది మాసాలుగా ఆదిలాబాద్ అడవి ప్రాంతాలలో ఎన్నడూ లేనంతటి కరువు తాండవమాడుతోంది. వర్షాలు లేక రబీ పంట, ఖరీఫ్ పంట, రెండూ నాశనమయ్యాయి. మామూలుగానే నికృష్టమయిన గిరిజనుల తిండి మరింత నికృష్టమయింది. పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన వారి రిపోర్టుల ప్రకారం అక్కడి గిరిజనులు ఈ కరువు కాలంలో తినని పదార్థం లేదు. ఇప్పపూలు, రేగుపళ్ళు, పరికిపళ్ళు, కంకపెనాలు, మేకలు తినే దొంగ్రకాయలు, తింటున్నారు. తినలేని గింజలను ఉడికించి గంజికాచుకుని తాగుతున్నారు. కరువు ఫలితంగా జొన్నపంట పూర్తిగా దెబ్బతినిపోగా జొన్న బెరడు నమిలి రసం మింగి బెరడు ఉమ్మేస్తున్నారు. వట్టివి తింటే ప్రమాదకరమైన మాటి గడ్డలను మూడు నాలుగు సార్లు చింతాకుతో ఉడికించి చల్లార్చి తింటున్నారు. అడవిచెట్ల ఆకులు సహితం తింటున్నారు.

తినడానికి ఏమీ దొరక్కపోతే ఆకులయినా తినొచ్చుగాని, తాగడానికి నీళ్ళు లేకపోతే యమయాతనే. ఈ కరువు కాలంలో ఆదిలాబాద్ అడవి ప్రాంతాలలో గుక్కెడు మంచినీళ్ళ కోసం మైళ్ళు నడవాలట. మంచినీళ్ళు దొరికే గూడేలు ఎక్కడో గాని కనిపించవట.

పరిపాలనావ్యవస్థ రాక్షసత్వాన్ని ఈ కరువు అపూర్వంగా బయటపెట్టింది. ఒకపక్క స్థానిక అధికార్లు ఈ కరువుకాటకాన్ని అదను చేసుకొని గిరిజనులనుండి లంచాలు మింగుతూంటే వేరొకప్రక్క ఇందిరాకాంగ్రెస్ నాయకులు కరువును తమ ముఠా తగాదాలలో ఒక ఆయుధంగా వాడుకున్నారు. గోండ్లకోసం ప్రభుత్వం ఏమీ చేయలేదని, మన నిర్వ్యాపక పాత్రికేయులచేత 'అసమ్మతి వర్గీయుల'ని పిలవబడే వాళ్ళు ఆరోపిస్తే, ప్రభుత్వం చేసిందంతా లంబాడాలకే పోయిందన్న ధ్వని ఆ ఆరోపణలో వినిపించి కాంగ్రెస్ లంబాడా నాయకులు లేదులేదు ప్రభుత్వం చాలా చేసిందంటే, వెనుకటి ముఖ్యమంత్రికి ఆ ఆరోపణలో విదేశీహస్తం సహితం కనిపించింది.

అయినా, 4శాతం మాత్రం నీటి పారుదల సౌకర్యాలకు నోచుకున్న ఆదిలాబాద్ భూమి వర్షం లేక బీళ్ళు పడిపోయినా, పత్తిచేలూ, జొన్నచేలూ, బహుశా రేపు ఇప్పచెట్లుగూడ ఎండిపోయినా, వాస్తవానికి ఆ బాధ్యత కేవలం ప్రకృతిది కాదు. ఆదిలాబాద్‌కు గోదావరి చేరువలో వుంది. ఆ గోదావరమ్మ పుణ్యానే తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలు 50శాతంపైగా నీటిపారుదల సౌకర్యాలు కలిగివున్నాయి. నదికి దగ్గరగావున్న ఆదిలాబాద్‌లో భూగర్భజలాలు పుష్కలంగానే వుండివుండాలి.

అయినా రిగ్గులు లేవు. బోర్‌వెల్సు లేవు—అందుకే భూమివున్న గిరిజనులు సహితం ఆకలికి మాడుతున్నారు. మాడుతారుగాని, వాళ్ళు ఆకలికి చావరు. వాళ్ళను ప్రకృతీ వ్యవస్థా కలిసి తిండికి మాడ్చి, దాహానికి ఎండించినా వాళ్ళు బ్రతికే వుంటారు—ప్రతీకారం కోసం బ్రతికే వుంటారు. బ్రిటిష్‌వాడు ఈ దేశానికి వచ్చి నప్పటి నుండి వాళ్ళను వాళ్ళ అడవుల నుండి బయటికో లేక అడవి గర్భానికో తరుముతూనే వున్నారు. సంరక్షిత అడవులన్నారు, పరిశ్రమల కోసం అడవులన్నారు, ఏదన్నా దాని అర్థం గిరిజనుల అడవులను వాళ్ళకు కాకుండ చేయడమే. గిరిజన పోరాటానికి ప్రసిద్ధమయిన వైనాడు (కేరళ)లో ముప్పయి ఏళ్ళ క్రితం గిరిజనులలో 20శాతం మాత్రమే భూమిలేనివాళ్ళు. ఇవ్వాళ అక్కడ 80 శాతం భూమి లేనివాళ్ళు. అయినా అక్కడి గిరిజనులు ఆకలికి చావ లేదు, కొందరు పోరాటం చేసి చచ్చారు, బ్రతికి వున్నవాళ్ళు ఇంకా పోరాటాలు చేస్తారు.

1976లో (అంటే ఎమర్జెన్సీ కాలంలో, అంటే ఓట్లకోసం దొంగనాటకాలు ఆడాల్సిన అవసరంలేని రోజుల్లో) నేషనల్ అగ్రికల్చరల్ కమిషన్ తన నివేదికలో, అడవులు ప్రధానంగా (కాగితం, కలప, ఇత్యాది) పరిశ్రమలకు ముడి సరుకులు సరఫరా చేయడం కోసం వుద్దేశించబడాలనీ, అందుకోసం అడవి ప్రాంతాల ప్రజలపై (వాళ్ళు గిరిజనులు కానీ గిరిజనేతరులు కానీ) అవసరమయిన ఆంక్షలు విధించాలనీ, అడవుల్ని ప్రజలే నాశనం చేస్తున్నారనీ, కాబట్టి పారిశ్రామిక పెట్టుబడిదార్ల లాభాల కోసం దేశంలోని 7.5 కోట్ల హెక్టార్ల అటవీ భూభాగంలో కనీసం 4.8 కోట్ల హెక్టార్ల భూభాగాన్ని (అంటే 65 శాతాన్ని) ప్రజల నుండి రక్షించి 'ఉత్పత్తి వనాలు' (Production forests)గా ప్రకటించి కలపపై ఆధారపడే పరిశ్రమల కోసం వాటిని వినియోగించాలనీ, చెప్పినమాట చాలామందికి తెలీదు.

దోపిడీ వ్యవస్థ జరిపే ఈ అమానుషమయిన వేటకు ప్రకృతి వైపరీత్యం తోడయినప్పుడే క్షామం ఏర్పడిందిగాని, కేవలం వర్షాలు పడక పోవడం వల్ల కాదు. చైనా విప్లవానికి పూర్వం విశాలమయిన ఆ దేశంలో ప్రతీ ఏడూ ఎక్కడో ఒకచోట క్షామాలు రావడం, జనం వందలలో వేలల్లో చావడం జరిగేది. విప్లవం వచ్చిన తరువాతి సంవత్సరంనుండి వర్షాభావం ఏర్పడ్డా క్షామాలు లేవు, క్షామపు చావులు లేవు. చైనా విప్లవ విజయాలలో అతి గొప్పది ఇదేనని ఎడ్గార్ స్నో అంటాడు.

అటువంటి విప్లవాన్ని ఈ దేశంలో రానీయకుండ చేయడం కోసమే ఇంద్రవెల్లి జరిగింది. ఆ ఎరుకతోనే ఈ ఏప్రిల్ 20న, ఇంద్రవెల్లిలో గత సంవత్సరం చనిపోయిన గిరిజన మృతవీరుల స్మృతికి స్థూపాన్ని నిర్మించి ఆవిష్కరించాలనీ, సంస్మరణ సభ జరపాలనీ, నిర్ణయించుకోవడం జరిగింది. ఈ సారి పోలీసులు వేరే ఎత్తుగడ వేసుకున్నారు. సభకు పర్మిషన్ ఇవ్వననలేదు. స్థూపం నిర్మించ వద్దనలేదు, 144 సెక్షన్ ప్రకటించ లేదు. స్థూపానికి భూమి కొనుక్కోనిచ్చారు. సభకూ ఏర్పాట్లు చేసుకోనిచ్చారు. అయితే స్థూప నిర్మాణానికి ఎవ్వరూ ముందుకు రాకుండ, సభకు గిరిజనులు రాకుండ చేయవలసింది చేసారు. స్థూపానికి సిమెంటు తెస్తే సిమెంటును, తెచ్చిన లారీని, 'కస్టడీ'లోకి తీసుకున్నారు. సభకు వారం రోజుల ముందు గూడెం గూడెం తిరిగి, క్యాంపులు పెట్టి, తుపాకీల ప్రదర్శనతో భయపెట్టి, గత సంవత్సరం గిరిజన రైతు కూలీ సంఘం సభకు హాజరయిన వేలాది గిరిజనులలో ఒక్కరు సైతం రాకుండ చేసారు. గిరిజనులలో సభను గురించి ప్రచారం చేయడానికి తిరిగిన యువకుల దళాలను మూడింటిని సిరికొండలో, ఆదిలాబాద్‌లో అరెస్ట్ చేసారు. రెండు దళాలను సెక్షన్ 506 కింద బుక్ చేసి మూడవదళాన్నిమాత్రం నిజామాబాద్ తరలించారు. మరికొందరిని ఇంద్రవెల్లిలో బస్సు దిగుతుండగా అరెస్టు చేసారు. అరెస్టయిన వారిలో ఒకరు రామగుండంకు చెందిన మొండయ్య అనే డ్రైవరు, అతనితో బాటు ఇద్దరు స్త్రీలు. మొత్తం అరెస్టయిన వారి సంఖ్య 38. ఇంకొందరిని బస్సు దిగగానే నిలిపి గదమాయించి 'ఎవడు పంపాడు మిమ్మల్ని? మా మీద పాటలు పాడడానికి వచ్చారా?' అని అడిగారు.

ఆనాడు ఇంద్రవెల్లిలో గ్రామ జనం కంటె పోలీసులే ఎక్కువ ఉన్నారు. కలెక్టరు, డిప్టీకలెక్టరు, డి. ఐ. జి, ఎస్. పి ల నుండి సర్కిళ్ళ అమీన్ సాబ్‌లు మామూలు కానిస్టేబిళ్ళ వరకు ఆ వారం దినాలలో ఇంద్రవెల్లిని దర్శించని వాడు లేడు. 20 పొద్దున 200 మంది పోలీసులు గ్రామంలో మార్చి చేశారు—ప్రజల్ని భయపెట్టడానికి. ఇటూ అటూ ఉన్న గ్రామాలలో (పిట్టబొంగరం, గుడిహత్నూర్ వంటివి) పోలీసు క్యాంపులు పెట్టారు. హోటళ్ళలో పోలీసులు, చాయ దుకాణాల్లో పోలీసులు, రోడ్ సైడు కట్టలమీద పోలీసులు, చెట్లక్రింద పోలీసులు, ఆనాడు ఆ ప్రాంతం పోలీసుల మయం. ఫలితంగా అక్కడి గ్రామాల నుండి, కొంత అర్థిక స్తోమత గలవాళ్ళంతా ఆదిలాబాద్ పోగా మిగిలిన వాళ్ళు తలుపులు బిగించుకు కూర్చున్నారు. దూరప్రాంతాల నుండి సభకని పరిచయస్తులు వచ్చినా ఇండ్లో ఉండనీయలేదు.

## పోతన పంచశతి ఉత్సవాలు :

## 'పశుప్రకాండు'

వరంగల్‌లో మార్చిలో రాష్ట్రప్రభుత్వ ఆర్థిక, అధికార సహకారంతో జరిగిన పోతనపంచశతి ఉత్సవాలకు ఒక నిర్దిష్టమైన ఆశయమున్నది. రాజులను, రాజరికాన్ని 500 సం॥లనాడే వ్యతిరేకించిన అభ్యుదయ కవిగా పోతనను గొప్ప చేసి అతని భాగవతంలోని భావాలను, సంస్కృతిని ప్రజల్లో ప్రచారం చేయడం వారి లక్ష్యం. పాలకవర్గ సంస్కృతిలో వచ్చిన సంక్షోభాన్ని నివారించేందుకు, ప్రజల్లో కలుగుతున్న చైతన్యాన్ని తట్టుకోవడానికి వారు చేసిన ప్రయత్నం ఇది.

తమకు ఇబ్బంది కలిగించి, సమాధానం చెప్పుకోవలసివచ్చే అంశాలను, రాజకీయాలను ప్రస్తావన లోనికి రానివ్వడం నిర్వాహకులకు యిష్టం కాదు. పోతనను అభ్యుదయ కవిగా గొప్ప చేయడంకోసం, రాజులను, రాజరికాన్ని వ్యతిరేకించాడనే ప్రస్తావన నామమాత్రంగా వచ్చిందే కాని రాజరికమంటే ఏమిటి ? దాని స్వభావ

---

నిజానికి దూరప్రాంతాల నుండి ఎక్కువ మందిని రానీయలేదుగూడ. అనాడు మధ్యాహ్నం నుండి ఇంద్రవెల్లి మీదుగా వెళ్లే బస్సులను అటు ఉట్నూరు దగ్గర ఇటు అదిలాబాద్ దగ్గర ఆపేయించారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆదిలాబాద్ రావలసిన మంచిర్యాల ఎక్స్‌ప్రెస్ ఇంద్రవెల్లికి అవతల ఉట్నూరు దగ్గరే ఆగిపోయింది. సాయంత్రం అదిలాబాద్ నుండి బయలుదేరి ఇంద్రవెల్లి మీదుగా భీంపూర్ వెళ్లే 'అర్డినరీ' అదిలాబాద్‌లో బయలుదేరుతుండగా డిపో కంట్రోలరు ఆదరాబాదరా వచ్చి తానుపద్దంటున్నా వినకుండ బస్సును బయటకు తెచ్చినందుకు డ్రైవర్ని గూల నాడి ఆపేయించాడు. సంక్షోభంలో 'ప్రభుత్వరంగం'పోలీసు రంగమవుతుందనడానికి ఇదొక చక్కటి నిదర్శనం.

అయినా సభ జరిగింది. హాజరయింది వందమంది లోపు కావచ్చు. ఒక్క గిరిజనుడూ లేకుండవచ్చు. కాని గిరిజనులు తమ కామ్రేడ్ల సంస్మరణ సభకు రాకపోవడానికి కారణం వాళ్ళకు 'పౌరకల పార్టీ' పట్ల ఏర్పడ్డ విముఖతా కాదు, ఈ దోపిడీ వ్యవస్థ పట్ల ఏర్పడ్డ సుముఖతా కాదు. 'మేము ఏ పోరాటానికయినా సిద్ధమే, కాని మీటింగుకు మాత్రం రాము' అని గిరిజన స్త్రీలు ప్రచారానికి వెళ్ళిన వరంగల్ కామ్రేడ్లతో అన్నారు. ఆ పోరాట ఉత్సాహాన్నీ ఆ పోరాటాన్నీ పోలీసులూ ఆపలేరు, పోలీసుల ప్రభువులూ ఆపలేరు.